సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



పల్లెపల్లెకు బ్రహ్మేంద్రుడి రథయాత్ర
బ్రహ్మంగారిమఠం మండలంలో శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. -10లో..



క్రీడలతో మానసిక ఉల్లాసం
క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని జేసీ సీఎం సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. -10లో..



స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు అన్ని విధాలుగా ప్రోత్సాహం
స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ ఎం.వి. రామ చంద్రారెడ్డి పేర్కొన్నారు. -10లో..

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
కడప	6.31	4.50
ప్రొద్దుటూరు	6.30	4.53
పులివెందుల	6.34	4.55

తాజాల స్పీడ్.. మాజీల బ్రేక్

జిల్లాలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల అభ్యర్థిత్వాలకు సీనియర్లు బ్రేకులు వేస్తున్నారు. టికెట్లపై వ్యూహాత్మక ఎత్తుగడలు పన్నుతున్నారు. మద్దతు అంటూనే అవకాశమిస్తే పోటీ చేస్తామని ప్రకటిస్తున్నారు. ప్రత్యక్షంగా తెరపైకి వచ్చేందుకు ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తున్నారు. ఇంతకాలం తెరవెనుక ప్రయత్నాలు ఆరంభించిన నేతలు ఒక్కొక్కరుగా తెరముందుకు వస్తున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదివారం చేసిన ప్రకటన అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



- టీడీపీలో తెరపైకి మాజీ ఎమ్మెల్యేలు
- వ్యూహాత్మకంగా మాజీ ఎమ్మెల్యే వరద అడుగులు
- పుట్టాను తప్పించేందుకు మాజీ మంత్రి డీఎల్ ఎత్తుగడలు
- కడపలో లక్ష్మిరెడ్డి కుటుంబానికి అడ్డంకులు
- వరుసగా నాలుగు సార్లు ఓడిన వారికి టికెట్ లేదని లోకేష్ వ్యాఖ్యలు
- ఈ నెపంతో కమలాపురం టికెట్ అడ్డుకునేందుకు యత్నాలు


వరదరాజులరెడ్డి


ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


డీఎల్ రవీంద్రారెడ్డి


పుట్టా సుధాకర్ యాదవ్


వీరశివారెడ్డి


పుత్తా నరసింహారెడ్డి


లక్ష్మీరెడ్డి


శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లాలో టీడీపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమే లేదు. 2019 ఎన్నికల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవలేదు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న మాజీ ఎమ్మెల్యేలు ఎన్నికల గడువు సమీపించే కొద్ది తమ అంతరంగాన్ని బహిర్గతం చేస్తున్నారు. ఇదివరకు కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఇలాంటి ప్రకటనే ఓమారు చేయగా, తాజాగా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెరపైకి వచ్చారు. అక్కడి టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని సమర్థిస్తూనే అవకాశమిస్తే పోటీ చేస్తానని ప్రకటించారు. అదే బాటలో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే డీఎల్ రవీంద్రారెడ్డి కూడా ఉన్నట్లు పరిశీలకులు వివరిస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ మరో మూడుసార్లు పోటీ చేసినా మైదుకూరులో గెలిచే పరిస్థితి లేదు. 2014–19 వరకు పుట్టా సుధాకర్ టీడీపీ ఇన్‌చార్జిగా మైదుకూరు నియోజకవర్గంలో అవలంబించిన వైఖరి అందుకు ప్రధాన కారణమని డీఎల్ వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. ఆమేరకు ఇదే విషయమై ఆంతరంగికులతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈమారు టికెట్ ఇస్తే ఎన్నికల్లో పోటీ చేస్తానని మీరంతా రెడీగా ఉండాలంటూ డీఎల్ సంకేతాలు ఇస్తున్నట్లు పరిశీలకులు పేర్కొంటున్నారు.

లక్ష్మిరెడ్డి కుటుంబానికి అడ్డంకులు..

కడపలో టీడీపీ టికెట్ తమ కుటుంబానికి దాదాపు ఖరారైనట్లు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి నియోజకవర్గంలో గత కొంతకాలంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎన్నికల్లో ఈమారు మద్దతు ఇవ్వాలంటూ ఉదయాన్నే టీ అంగళ్ల వద్ద పలువురితో ముచ్చటిస్తూ, ఆయా డివిజన్లలో ప్రముఖులతో మంతనాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లక్ష్మిరెడ్డి కుటుంబానికి తప్ప, ఇంకెవ్వరికైనా టికెట్ ఇవ్వాలనే దిశగా జిల్లాలోని కొందరు టీడీపీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆమేరకు గతంలో జిల్లాలో నారా లోకేష్ పర్యటనలోనే ఈ రకమైన విభేదాలు తెరపైకి వచ్చాయి. ఆలంఖాన్‌పల్లె మీదుగా జరగాల్సిన లోకేష్ పర్యటనను రింగ్‌రోడ్డు ద్వారా దేవుని కడపకు మళ్లించారు. అప్పట్లో పోరుగు నియోజకవర్గానికి చెందిన పుత్తా నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఈ పర్యటన మార్పుకు ప్రధాన కారకులుగా పలువురు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆ ఇద్దరు నేతల ద్వారానే డాక్టర్ కృష్ణకిశోర్‌రెడ్డి పేరు తెరపైకి తెస్తున్నట్లు సమాచారం. అలా కుదరకపోతే శ్రీనివాసులరెడ్డి కుటుంబానికి టికెట్ కట్టబెట్టాలనే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా లక్ష్మిరెడ్డి కుటుంబాన్ని కట్టడి చేయాలనే ఆలోచనలతో జిల్లా టీడీపీ నేతలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

వరుసగా ఓటమి చెందిన సాకుతో..

వరుసగా నాలుగు పర్యాయాలు ఓటమి చెందిన వారికి ఈమారు పార్టీ టికెట్ ఇచ్చేది లేదని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇదివరకూ ఓమారు ప్రకటించారు. ఆ ప్రకటననే సాకుగా చూపించి కమలాపురం టికెట్ అడ్డుకోవాలనే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఇప్పటి వరకూ వరుసగా నాలుగు సార్లు ఓటమి పాలయ్యాయ్యారు. ఈమారు కమలాపురం టీడీపీ అభ్యర్థిని మార్చాలనే డిమాండ్ జిల్లా నేతల నుంచి తెరపైకి వస్తోంది. ఆమేరకు అంతర్గత నివేదికలు సైతం అధిష్టానానికి చేరవేస్తున్నట్లు సమాచారం. ఇలా ఎక్కడికక్కడ మాజీ ఎమ్మెల్యేలు ప్రత్యక్ష రాజకీయాల్లో మరోమారు తలపడేందుకు వారి ప్రయత్నాలను ముమ్మరం చేస్తుండడం తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశమైంది.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


కడప చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవ గురువులు

కడప కల్చరల్: జిల్లాలో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పలుచోట్ల అర్ధరాత్రి నుంచి మరికొన్నిచోట్ల తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ఈస్టర్ విశేషాలను తెలిపారు. క్రీస్తు మరణం నుంచి మూడవరోజు కొత్త జీవంతో పునరుత్థానం చెందడం దైవాన్ని మహిమ పరిచినట్లయిందన్నారు. ఈ సందర్భంగా వారు బైబిల్‌లోని క్రీస్తు పునరుత్థాన ఘటనలను భక్తులతో చదివించి అర్థాన్ని వివరించారు. కడపలోని సీఎస్ఐ చర్చిలో సీఎస్ఐ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్, మరియాపురంలోని సెయింట్ మేరీస్ క్యాథడ్రల్ చర్చిలో గురువులు ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. అలాగే జిల్లాలోని పలు చోట్ల ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ఆనందోత్సాహంతో వసంతాలు చల్లుకున్నారు.


ప్రొద్దుటూరు ఎస్పీజీ చర్చిలో ప్రార్థనల్లో క్రైస్తవులు

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో జ్యోతిరావుపూలే జయంతి

కడప సిటీ : కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మంగళవారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జేసీ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 9.30 గంటలకు పాత బస్టాండులోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల అలంకరణోత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జ్యోతిరావుపూలే జయంతి వేడుక జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అధికారులు, బీసీ సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

29 నుంచి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

కమలాపురం: బద్వేల్‌లో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న డీవైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణా తరగతుల్లో నిరుద్యోగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఇమామ్, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాభారతయజ్ఞం


మహాభారతయజ్ఞంలో దుర్యోధనుని వధ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెలో జరుగుతున్న మహాభారతయజ్ఞం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ప్రముఖ భాగవతారిణి శారదచే గత 18 రోజులుగా పగలు హరికథలు, రాత్రి నాటకాలు విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన దుర్యోధనుని వధ, పట్టాభిషేకం కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. వారికి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మల్లయ్యకొండకు ఆర్టీసీ సర్వీసు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ఒక సర్వీసు మాత్రం నడపనున్నట్లు ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. తరువాత తంబళ్లపల్లె–మల్లయ్యకొండకు సాయంత్రం వరకు సర్వీసులు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

నేటి నుంచి పీలేరు-శ్రీశైలం, కాణిపాకం బస్సు సర్వీసులు

పీలేరు రూరల్: పీలేరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలం, కాణిపాకానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సోమవారం నుంచి నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నుంచి ఉదయం 5 గంటలకు బస్సు సర్వీసు ప్రారంభమై చిత్తూరు మీదుగా కాణిపాకం చేరుతుందన్నారు. తిరిగి 6.45 గంటలకు అక్కడ బయలుదేరి పీలేరుకు 8 గంటలకు చేరుకుంటుందన్నారు. పీలేరు నుంచి శ్రీశైలానికి ఉదయం 8.30 గంటలకు బయలుదేరి రాయచోటి కడప, పోరుమామిళ్ల మీదుగా సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు బయలుదేరి సాయంకాలం 5.30 గంటలకు పీలేరు చేరుతుందని వివరించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి వేకువజామునే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

మృత్యువులోనూ తోడై..!

వారిద్దరూ తోడబుట్టిన అక్కాతమ్ముళ్లు. ఆడుతూ పాడుతూ కలిసి మెలిసి ఆనందంగా పెరిగారు. ఇటీవల అమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం.. నాన్న కూలి పనులు చేసుకుంటూ వేరొకచోట ఉండిపోవడంతో వారిని అమ్మమ్మ చేరదీసింది. అమ్మమ్మ ఇంట ఆదివారం ఈస్టర్ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం పూట సరదాగా ఈత కొడదామని సమీపంలోని కాలువ వద్దకు వెళ్లారు. అంతే.. నీళ్ల లోతు తెలియక ఒకరి వెంట మరొకరు మృత్యు ఒడికి చేరుకున్నారు. మృత్యువులోనూ అక్కాతమ్ముడు తోడుగా వెళ్లిపోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.



సాయితేజశ్రీ(ఫైల్) సాయి సుశాంత్(ఫైల్)

- ఈస్టర్ పండగ రోజు విషాదం
- అక్క, తమ్ముడితో పాటు, మరో యువకుడి మృతి

వేంపల్లె: వేంపల్లె మండలం అలవలపాడు గ్రామంలో ఈస్టర్ పండుగ సందర్భంగా విషాదం చోటు చేసుకుంది. చక్రాయ పేట మండలం చిలేకాంపల్లె గ్రామానికి చెందిన రూతూ, సురేష్ దంపతులకు కుమార్తె సాయితేజశ్రీ, కుమారుడు సాయి సుశాంత్‌లు అనే ఇద్దరు పిల్లలున్నారు. తల్లి రూతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. తండ్రి సురేష్ జీవనోపాధి కోసం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లలిద్దరూ వేంపల్లె మండలం అలవలపాడు గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న అమ్మమ్మ శశికళ ఇంటిలో ఉంటున్నారు. వారిని వేంపల్లెలోని నారాయణ పాఠశాలలో చదివిస్తోంది. సాయిసుశాంత్ 5వ తరగతి, సాయితేజశ్రీ 6వ తరగతి చదువుతున్నారు. ఈస్టర్ పండుగకు శశికళ తమ బంధువైన వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన జానయ్య, శశికుమార్‌లను కూడా పిలిచింది. జానయ్యకు ఆరు నెలల క్రితం పాలగిరి గ్రామానికి చెందిన శృతితో వివాహమైంది. ఎంతో సంతోషంగా ఈస్టర్ పండుగ జరుపుకుని ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి సరదాగా పిల్లలతో కలిసి జీఎన్ఎస్ఎస్ కాలువలోకి ఈతకు వెళ్లారు. లోతుగా ఉన్న నీళ్లలోకి వెళ్లడంతో పిల్లలు ఎంత సేపటికి బయటికి రాక పోవడంతో జానయ్య, శశికుమార్‌లు వారి కోసం వెతక సాగారు. లోతుగా ఉన్న నీళ్లలోకి వెళ్లడంతో జానయ్య కూడా మృతి చెందాడు. శశికుమార్ బయటికి వచ్చి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు గమనించి కాలువ వద్దకు చేరుకుని నీటిలో మునిగి పోయిన ముగ్గురిని బయటికి తీశారు. వారు అప్పటికే మృతి చెందారు. ఓవైపు కూతురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషాదం ఇంకా వెంటాడుతుండగానే.. మనవడు, మనుమరాలు కూడా శాశ్వతంగా దూరం కావడంతో ఆ తల్లి వేదన వర్ణనాతీతంగా మారింది. మరోవైపు వివాహమైన ఆరు నెలలకే భర్తను కోల్పోయిన ఇల్లాలిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ఒకేసారి ముగ్గురు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీలు కల్పలత, రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి


వైవీయూ : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు తమటం కల్పలత, ఎం.వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఆకేపాటి

ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పేద పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే క్రమంలో విద్యాభివృద్ధికి అనుగుణంగా ఎన్నో వినూత్న కార్యక్రమాల ద్వారా ముందుకు వెళ్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వంపై నమ్మకంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలను గెలిపించారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

- కృష్ణ, గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తమటం కల్పలత మాట్లాడుతూ పీఆర్‌టీయూ సమావేశంలో తీసుకునే తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు.
- పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా పనిచేస్తానని అన్నారు. ఎల్లవేళలా ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.
- మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగకరమైన ఎన్నో ఉత్తర్వులను సాధించిపెట్టిన సంఘం పీఆర్‌టీయూ అన్నారు. సంఘటితంగా ఉండి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.
- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు పలు పాఠశాలల్లో అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చక్కటి పరిష్కారం చూపగలరన్న నమ్మకంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి అనుకూలంగా ఉపాధ్యాయులు ఓట్లు వేసి గెలిపించారన్నారు.
- పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైష్ణవ కరుణానిధిమూర్తి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చాలని, సీపీఎస్ ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు.
- రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ నూతన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, గత పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలన్నారు.
- రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బైరి అప్పారావు మాట్లాడుతూ అకడమిక్ క్యాలండర్‌ను పకడ్బందీగా అమలుచేయాలని కోరారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు.
- రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ డి. గోపీనాథ్ మాట్లాడుతూ సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. మున్సిపల్ టీచర్స్‌కు సర్వీస్ రూల్స్ సవరణ చేసి యూనిట్ ప్రాతిపదికన పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎ. వెంకటరమణ, ఎం. రవిశంకర్, జె. వెంకటసుబ్బయ్య, ఏబీ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పుష్పయాగాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



పువ్వులన్నీ విరిసె.. సీతాపతి మురిసె

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో నయనానందకరంగా పుష్పయాగం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి కోదండ రామయ్య సన్నిధిలో ఆదివారం పుష్పయాగాన్ని వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన నయన మనోహరమైన పుష్పాలతో దాశరథిని అర్చించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఈ వేడుకను తిలకించి పులకించిపోయారు.

కమనీయ ఘట్టం.. భక్తుల తన్మయత్వం

ఏకశిలానగరి కోదండ రాముడి సన్నిధిలో ఆదివారం పుష్పయాగం కనుల పండువగా సాగింది. ఈ కమనీయ ఘట్టాన్ని కనులారా తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు. రంగురంగుల పుష్పాలతో జగదభిరాముడికి పుష్పాభిషేకం చేశారు. ఉదయం సుప్రభాత సేవ జరిగింది. ఆలయశుద్ధి, ఆరాధన చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 5:30 గంటలకు ఆలయ ప్రత్యేక అధికారి నటేష్ బాబు ఆధ్వర్యంలో పుష్పప్రదర్శన చేశారు. బెంగళూరు, నాగర్‌కోయిల్, శ్రీరంగం, చెన్నై, తిరుపతి, కడప నగరాల నుంచి 2.5 టన్నుల పుష్పాలను తెప్పించారు. గులాబి, చామంతి, సూరువరహాలు, సంపంగి, మల్లె, గన్నేరు, మొగలిరేకులు, కనకాంబరాలు, తామర పూలు తీసుకువచ్చారు. తులసిదళాలు, దవనం, పన్నీరు, మరవం పత్రాలతో సీతారామలక్ష్మణ మూర్తులకు పుష్ప నీరాజనం చేశారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడేందుకు స్వామివారికి పూజలు చేసి భూ మాతను ప్రసన్నం చేసుకునేందుకు వైష్ణవాలయాలలో పుష్పయాగం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాగం నిర్వహించడంతో సమస్త దోషాలు తొలగిపోతాయని వేదపండితులు రాజేష్ భట్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి సంపులో పడి వ్యక్తి మృతి


నరసింహులు మృతదేహం

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామంలోని పంట పొలంలో ఏర్పాటు చేసిన నీటి సంపులో పడి నరసింహులు(32) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు బుసిరెడ్డిపల్లెలో స్నేహితులు ఏర్పాటు చేసిన విందుకు నరసింహులు హాజరయ్యాడు. అక్కడ అందరూ సరదాగా గడిపారు. స్నేహితులు చెట్టుకింద కూర్చుని ఉండగా నరసింహులు సంపువద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గమనించిన స్నేహితులు అతన్ని బయటకు తీశారు. అప్పటికే అతను మృతి చెందాడు.

మృతుడు కమలాపురం మండలం పెద్ద చెప్పలికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ నలుగురికి గాయాలు

పులివెందుల : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా స్థానిక క్రిస్టియన్‌లైన్‌లో రంగులు వేసుకొనే క్రమంలో డేని, యోహాన్ వర్గాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.యోహాన్ వర్గంలో ప్రకాష్, మరో ఇద్దరికి, డేని వర్గంలో రవితేజకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఏరియాసుపత్రికి తరలించారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలగండం.. జరభద్రం

- ఈతకు వెళ్తూ మృత్యువాత పడుతున్న విద్యార్థులు
- అధికారులు, తల్లిదండ్రులు అప్రమత్తమైతే మేలు


కొత్తచెరువులో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి బాలాజీ కోసం గాలిస్తున్న ఈతగాళ్లు (ఫైల్)

మదనపల్లె సిటీ : పిల్లలకు నీళ్లంటే చాలా ఇష్టం. వేసవి ఎండల నేపథ్యంలో నీటిలో ఆడటమంటే వారికి ఎక్కడ లేని ఆనందం. అందుకే ఒంటి పూట బడులు నడిచేటప్పుడు, వేసవి సెలవుల్లో సరదాగా బావులు, కుంటలు, వాగులు, చెరువుల వద్దకు స్నేహితులతో కలిసి వెళ్తుంటారు. ఇందులో కొందరు ఈత కొడతారు, మరి కొందరు ఈత రాక పోయినా సరదాగా కుంట అంచున నీటిలో దిగి ఆడుతుంటారు. ప్రమాదవశాత్తు నీట మునిగిపోతున్నారు. సమయానికి అక్కడ పెద్దవాళ్లు ఎవరూ ఉండకపోవడంతో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా ఇలా జరుగుతున్నా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవటం లేదు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని మదనపల్లె, లక్కిరెడ్డిపల్లె, కలికిరి, రాజంపేట, పులివెందుల, జమ్మలమడుగు ప్రాంతాల్లో ఈతకెళ్లి పలువురు మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జలశయాలు,చెక్ డ్యాంలు, చెరువులు, కుంటలు, వాగులు, బావులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. వాటి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేవు. వాటిలో నిండా నీరు ఉండటంతో పిల్లలు సరదాగా ఈతకొడుతున్నారు. ప్రమాదశాత్తు చెరువులోని పూడికలో ఇరుక్కుపోయి మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. ఇంటర్ పరీక్షలు ముగిశాయి. ఈ నేపథ్యంలో ఎండ నుంచి ఉపశమనం కోసం పిల్లలు జనవనరుల వద్దకు వెళ్తుంటారు. తాము లేకుండా పిల్లలు నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

అన్నమయ్య జిల్లాలో..

- మదనపల్లె పట్టణం కృష్ణానగర్‌కు చెందిన పండు 9వ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి పట్టణ సమీపంలోని ఓ చెరువుకు ఈత కెళ్లారు. ప్రమాదవశాత్తు మృతి చెందాడు.
- కలికిరి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బాలాజీ స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృత్యువాతపడ్డాడు.
- లక్కిరెడ్డిపల్లె కాకులవరం సమీపంలో దేవేంద్ర అనే యువకుడు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మృతి చెందాడు.
- నిమ్మనపల్లె మండలానికి చెందిన ఓ యువకుడు ఈత కెళ్లి ప్రమాదశాత్తు మృత్యువాత పడ్డాడు.

వైఎస్సార్ జిల్లాలో..

- వేముల మండలం అలవలపాడు గ్రామ సమీపంలో ఉన్న జీఎన్‌ఎస్‌ఎస్ కాలువలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, యువకుడు ఉన్నారు.

ఈత వచ్చినవారు తప్పనిసరి



ఈత నేర్చుకునేందుకు బావులు,చెరువులు, కుంటల కంటే ఈత కొలను (స్విమ్మింగ్ పూల్) సురక్షిత ప్రదేశం. స్విమ్మింగ్‌పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వచ్చే పిల్లలను కోచ్ ఓ కంట కనిపెట్టుకుని చూస్తుంటారు. మరో వైపు తల్లిదండ్రులు కూడా పర్యవేక్షిస్తుండాలి. పల్లెల్లో ఈత నేర్చుకునేందుకు పిల్లలను ఇతరులతో పంపించొద్దు. ఈత వచ్చిన కుటుంబసభ్యులు తప్పనిసరిగా వెంట ఉండాలి.

-షేక్‌షఫీ, చీఫ్‌కోచ్, క్రీడాప్రాధికారసంస్థ, అన్నమయ్య జిల్లా

జాగ్రత్తలు తీసుకోవాలి



గట్టుపై నుంచి చెరువులు, బావుల్లోకి దూకకూడదు. ఈత నేర్చుకునే వారు వీపునకు బెండ్లు లేదా ట్యూబ్‌లపు ధరించి నీటిలో దిగాలి. తల్లిదండ్రుల సమక్షంలో ఈత నేర్చుకోవడం మంచిది. అధికారులు సైతం ప్రమాదకరమైన నీటి స్థాయి ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు.

-ప్రసాద్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్, మదనపల్లె

ఈతకు పిల్లలను వెంట తీసుకెళ్లాలి



ఈతకు వెళ్లే తమ పిల్లలను వెంట తీసుకెళ్లాలి. దూకే సమయంలో తగిన జాగ్రత్తలు చెప్పాలి. ప్రస్తుతం స్విమ్మింగ్‌పూల్స్ ఉన్నాయి. అక్కడ కోచ్‌లు ఉంటారు. ఇలాంటి చోట ఈతకు ప్రధాన్యత ఇవ్వాలి. వేసవిలో పిల్లలు ఎక్కడికి వెళుతున్నారనే విషయం కంట కనిపెట్టాలి.

-దేవకమ్మ, పీడీ, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

మదనపల్లెలో రెచ్చిపోతున్న మట్టిమాఫియా


అంకిశెట్టిపల్లె పంచాయతీలో అక్రమంగా మట్టితవ్వకాలు జరుపుతున్న జేసీబీ

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వస్థలాలు, కొండలు, గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ.. అక్రమంగా మట్టిని తరలిస్తూ నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ సెలవుదినాల్లో రెవెన్యూ అధికారుల తనిఖీలు ఉండవనే ధైర్యంతో చెలరేగిపోతున్నారు. వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తూ రూ. లక్షలు వెనకేసుకుంటున్నారు. వలసపల్లె పంచాయతీలో ఇటీవల హంద్రీనీవా కాలువను దర్జాగా పూడ్చివేసి మట్టితవ్వకాలు జరుపుతున్న టిప్పర్, హిటాచీ యజమానులపై కేసులు నమోదుచేసిన ఘటన మరువక ముందే అంకిశెట్టిపల్లె పంచాయతీలో మట్టి తవ్వకాలకు మకాం మార్చారు. ప్రభుత్వ రిజర్వ్‌డ్ ఫారెస్టుకు ఆనుకుని సర్వే నంబర్ 350, 370, హంద్రీ-నీవా కెనాల్ సర్వేనెం.375లో జేసీబీలతో మట్టి తవ్వుతూ, దగ్గరలో కాలువకు ఆనుకుని కొత్తపల్లెకు చెందిన ఓ రియల్టర్ వేస్తున్న అక్రమ లేఅవుట్‌లో చదును పనులకు తరలిస్తున్నారు. ఈ విషయమై అంకిశెట్టిపల్లె గ్రామస్తులు మీడియాకు సమాచారం అందించిన వెంటనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, ట్రాక్టర్‌లు కనిపించాయి. రెవెన్యూ అధికారులకు విషయాన్ని చేరవేసిన మరుక్షణమే అక్కడి నుంచి అవి మాయమయ్యాయి. దీనిపై స్పందించిన గ్రామస్తులు పగలు, రాత్రి తేడా లేకుండా గుట్టలు చదును చేస్తున్నారని, వీఆర్వో, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తహసీల్దార్ సీకే.శ్రీనివాసులును వివరణ కోరితే.. సమాచారం తెలిసిన వెంటనే వీఆర్వోను పంపామని, అయితే అక్కడి నుంచి వారు వెళ్లిపోయారన్నారు. ఈ క్రమంలో ఆ రహదారిలోనే మట్టిని తరలించేందుకు హంద్రీనీవా కాలువను అక్రమంగా పూడ్చివేసి వంతెన నిర్మించి ఉండటం గుర్తించామని, విచారణ చేసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

టమాటా ధరలు పతనం


మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మార్కెట్లో టమాటా ధరలు 20 రోజులుగా భారీగా పతనమవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో అత్యధికంగా రూ.6వరకు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. 20 రోజులు క్రితం వరకు మార్కెట్లో టమాటా ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. గతంలో కిలో రూ. 20 వరకు పలికాయి. ప్రస్తుతం రోజురోజుకు టామాటా ధరలు పతనమవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసీజన్‌లో మండలం మొత్తం మీద సుమారు 1565 ఎకరాల్లో టమాటా సాగు చేశారు. 20 రోజుల కిందట 25 కేజీల టమాటా క్రేట్ రూ. 300 నుంచి రూ. 450 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో 25కేజీల క్రేట్ ధర రూ.150 ఉంది. ప్రస్తుతం మొదటిరకం టమాటా కిలో రూ6, రెండోరకం కిలో రూ.4, మూడో రకం రూ.2 వరకు ధరలు పలుకుతున్నాయి. ఇక్కడి నుంచి మార్కాపురం, నరసరావుపేట, విజయవాడ, గుంటూరు, తమిళనాడులకు టమాటాలు ఎగుమతి చేస్తుంటారు. ప్రతిరోజూ 8 లోడ్ల టమటాలు లారీల్లో బయట ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్లో ధరలు ఒక్కసారిగా పతనమవడంతో రైతులు నష్టపోతున్నారు. కోతకూలీలు, రవాణా ఖర్చులు, కమీషన్లు పోను చేతికి రూ. 50 కూడా చేతికందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. బయట రాష్ట్రాల్లో స్థానికంగా టమాటా దిగుబడుతులు వస్తుండడంతో ఇక్కడ పండుతున్న వాటికి అక్కడ డిమాండ్ తగ్గిపోయింది.

సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో శౌర్య దినోత్సవం


సీఆర్‌పీఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న కమాండెంట్ రాజేష్ కుమార్

కలికిరి : అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్, సీఐఏటీ-3) కేంద్రంలో ఆదివారం శౌర్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ రాజేష్ కుమార్ ముందుగా సీఆర్‌పీఎఫ్ అమరులకు క్వార్టర్ గార్డ్ వద్ద నివాళులు అర్పించి, సీఆర్‌పీఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1965 ఏప్రిల్ 9న లఢక్ హాట్ స్ప్రింగ్‌లో టాక్ పోస్ట్ ఆఫ్ 'రన్ ఆఫ్ కచ్' దళంలోని సైనికులు చూపిన ధైర్యం, జవాన్లు ప్రదర్శించిన శౌర్యం కారణంగా ప్రతి ఏటా ఏప్రిల్ 9న శౌర్య దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. రన్ ఆఫ్ కచ్‌పై జవాన్‌లకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జవాన్‌లకు ఆటల పోటీలు, బాదాఖానా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్‌లు ఏకే సింగ్, నిషా మోల్, కదమ్ సింగ్, నందన్వార్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రవికుమార్, గిరిధర్, జి/240 మహిళలు, ట్రైనీలు, ఎస్ఓ, జవాన్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ బోల్తా

మదనపల్లె : జేసీబీ బోల్తాపడి డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో జరిగింది. వివరాలు రామసముద్రం మండలం రాజులూరుకు చెందిన శ్రీనివాసరాజు (30) జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ మేకలవారిపల్లె సమీపంలో జేసీబీతో భూమిని చదును చేస్తుండగా ప్రమాదశాత్తు బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌ను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బలిజపల్లె గంగమ్మకు పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజంపేట టౌన్ : అన్నమయ్య జిల్లా బలిజపల్లెలో కొలువైన గంగమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదాల కారణంగా ఈ ఏడాది జాతర జరిగే పరిస్థితులు కనిపించక పోవడంతో అనేక మంది భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అందులో భాగంగా శ్రీరామనవమి ఉత్సవాలు ముగియడంతో ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పలువురు ఎడ్లబండ్లకు, ట్రాక్టర్లకు వేపమండలు కట్టి గంగమ్మ సన్నిధి చుట్టూ తిప్పారు. ఇదిలా ఉండగా బలిజపల్లె గంగమ్మకు ఏటా లక్షల్లో ఆదాయం వస్తున్నట్లు ఇటీవలే దేవదాయశాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో ఆశాఖ అధికారులు అమ్మవారి సన్నిధిని తమశాఖ పరిధిలోకి తీసుకునేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు జాతర ఉండక పోవచ్చన్న అభిప్రాయం భక్తుల్లో వ్యక్తమవుతుంది. ఈ కారణంగా అనేక మంది భక్తులు సామూహికంగా అమ్మవారికి ఒకరోజు ముద్దలు పెట్టుకునేందుకు కూడా సిద్ధమవుతున్నారు. ఇందుకోసం పట్టణంలోని కొందరు ప్రముఖులు కూడా గంగమ్మ భక్తబృందంగా ఏర్పాటయ్యేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చట్టసభల్లో ఈడిగలకు ప్రాధాన్యత కల్పించాలి


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్ : చట్టసభల్లో ఈడిగ (గౌడ)లకు ప్రాధాన్యత కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత కేజే కుమార్ కోరారు. ఈడిగలకు రాజకీయ ప్రాతినిత్యం కల్పించే అంశంపై ఆదివారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, చర్చించారు. ఈడిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేజే కుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ కో-ఆర్డినేటర్ రమేష్ గౌడ్, బీజేపీ నేత బి.కిరణ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఈడిగలకు రెండు ఎంపీ, మూడు ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ స్థానాలతో పాటు వివిధ నామినెటేడ్ పోస్టులు కేటాయించాలన్నారు. జిల్లాకో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి చొరవ తీసుకోవాలని, ఈత, ఖర్జూరం మొక్కల పెంపకానికి బీడు భూములు కేటాయించాలని, గీత కార్మికులకు వాహన సదుపాయం కల్పించాలని, పిల్లల ఉన్నత విద్యకు, విద్యావంతులైన యువత పారిశ్రామిక రంగంలో రాణించేలా ప్రోత్సాహకాలను అందజేయాలని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చే రాజకీయ పార్టీలకు మద్దతునివ్వాలని నిర్ణయించారు.

కొలనులో జారిపడి యువకుడి మృతి


షేక్ ఇస్మాయిల్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : ఈత సరదా యువకుడి ప్రాణం తీసుంది. స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి ఇస్మాయిల్ (23) అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలంలో గండికోటలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ సుబ్బారావు కథన మేరకు వివరాలు. విజయవాడలోని భవానీపురం, వేర్వేరు కాలనీలకు చెందిన ఆరుగురు స్నేహితులు ఆదివారం సెలవుదినం కావడంతో గండికోటకు వచ్చారు.

సాయంత్రం షేక్ ఇస్మాయిల్, దినేష్‌బాబు, కార్తికేయ, చరణ్ కుమార్‌రెడ్డి, సతీష్ నాయుడు, పవన్‌కుమార్‌లు కలసి లోయ కింద భాగాన నీటి కొలనులో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. షేక్ ఇస్మాయిల్ నీటి కొలను వద్ద కొండపై నుంచి నిలుచుని ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ఈ సంఘటనలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుబ్బారావు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు.ఈతగాళ్ల బోట్ల సాయంతో కొలనులో దిగి ఇస్మాయిల్‌ను బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. మృతదేహన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : భూవివాదం కారణంగా జరిగిన గొడవలో ఓ కుటుంబంపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో ఆదివారం జరిగింది. నారిగానిపల్లె పంచాయతీ నమ్మూరిపల్లెకు చెందిన గంగులమ్మ, కదిరప్ప కుటుంబాల మధ్య భూమికి సంబంధించి ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గంగులమ్మ పొలం వద్ద పనులు చేసుకుంటుండగా కదిరప్ప కుటుంబ సభ్యులతో కలిసి తమకు సదరు పొలంలో భాగం ఉందని గంగులమ్మతో గొడవ పెట్టుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఆవేశానికి గురైన కదిరప్ప అతని కుటుంబీకులు వెంకటరమణ, శంకర, మరికొందరు కలిసి గంగులమ్మ (70)పై దాడి చేశారు. అడ్డువచ్చిన గంగులమ్మ కుమారుడు రామకృష్ణ (45) వరదాక్షి (30)పై దాడి చేయగా వారు గాయపడ్డారు.

భూఆక్రమణలకు పాల్పడిన ఐదుగురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : పేదల భూముల్లో అక్రమంగా ప్రవేశించడం, బాధితులను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం, ప్రభుత్వ భూములను కబ్జా చేయడం తదితర నేరాలకు పాల్పడే నిందితులపై కఠిన చర్యలు తప్పవని మదనపల్లె డీఎస్పీ కేశప్ప హెచ్చరించారు. నిందితులపై పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ, కాండ్లమడుగు క్రాస్‌లో భూకబ్జాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పదిమంది ఓ ముఠాగా ఏర్పడి తంబళ్లపల్లె నియోజకవర్గంలో భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ముఠా సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి (పీలేరు), ప్రవీణ్‌రెడ్డి (పీటీఎం),కిషోర్‌రెడ్డి (కోసువారిపల్లె), దాబాసూరి (చేనేతనగర్), డాబా అమర (అంగళ్లు), కురబలకోట మండలం కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన చెన్నకేశవ, రెడ్డెప్ప, శేఖర్, వెంకటరమణ, ప్రసాద్‌లపై 04-02-2023వ తేదీన బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం, దాడి, దొమ్మి కేసు నమోదు చేశామన్నారు. వీరిలో పీలేరుకు చెందిన భానుప్రకాష్‌రెడ్డి, కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన చెన్నకేశవ, రెడ్డెప్ప, వెంకటరమణ, ప్రసాద్‌లను ఆదివారం కాండ్లమడుగు క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిందితులు కాండ్లమడుగు క్రాస్‌లో పేదలకు చెందిన 2.5 కోట్ల రూపాయలు విలువ చేసే 1.25 సెంట్ల భూమిని భూకబ్జా చేసి, బాధితులను బెదిరించారన్నారు.. కాండ్లమగుడు క్రాస్ అమరనారాయణపురానికి చెందిన నారాయణ, కృష్ణమూర్తి, నాగరాజు, రమణ నలుగురు అన్నదమ్ములు వీరి దాయాదులైన చెన్నకేశవ అతని కుటుంబ సభ్యులు ఇద్దరికి 62.5 సెంట్ల భూమి భాగపరిష్కారంలో భాగంగా దక్కింది. అయితే నారాయణ 1986లో కృష్ణారెడ్డి వద్ద మరో 62.5 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. 2009లో చెన్నకేశవ తనకు చెందిన 62.5 సెంట్ల భూమిని అంగళ్లకు చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. నాలుగు సంవత్సరాలుగా నారాయణకు చెందిన 62.5 సెంట్ల భూమిలో తనకు సగభాగం ఉందంటూ గొడవ పడుతున్నాడు. నారాయణతో పాటు కుటుంబ సభ్యులను చంపేస్తామని చెన్నకేశవ, అతని అనుచరులు పలుమార్లు బెదిరించారు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం 4.02.2023వ తేదీన నారాయణ అతని భార్య అమరావతి, మరదలు శ్యామల, తమ్ముడు నాగరాజు, కుమారుడు వెంకటేష్ పొలంలో పని చేసుకుంటుండగా, చెన్నకేశవ కుటుంబ సభ్యులతో కలిసి భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అనుచరులతో నారాయణ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి సరిహద్దు రాళ్లు నాటేందుకు ప్రయత్నించారు. దీంతో బాధితుడు నారాయణ, అతని కుటుంబ సభ్యులు వారిని అడ్డుకోగా భానుప్రకాష్‌రెడ్డి, చెన్నకేశవ అతని అనుచరులు మరణాయుధాలతో నారాయణ కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించి, వారిపై హత్యాయత్నానికి ప్రయత్నించారు. దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనపై బాధితులు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ఐదుగురి నిందితులను అరెస్ట్ చేసి వారిని రిమాండ్ నిమిత్తం జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు తెలిపారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. నిందితులు గతంలో పలు నేరాలకు పాల్పడినట్లు పోలీసు రికార్డుల్లో ఉందన్నారు.

బైక్‌ల ఢీ : యువకుడి దుర్మరణం


షంషీర్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో మరియాపురం చర్చి సమీపంలో ఈనెల 8వతేదీ అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో జరిగిన రోడ్డుప్రమాదంలో సుంకేసుల షంషీర్ (22) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు.. కడప నగరం అలంఖాన్ పల్లెలో నివాసం ఉంటున్న మహమ్మద్ బాషా కుమారుడైన షంషీర్ శనివారం అర్ధరాత్రి తన ద్విచక్రవాహనంలో కడప నగరానికి వచ్చాడు. మరియాపురం చర్చి దగ్గరికి రాగానే తన పర్సు కిందపడిపోయింది. ఆగి దానిని తీసుకుంటుండగా, వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన షంషీర్‌ను అటువైపుగా వెళ్తున్న వారు గమనించి రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాహీర్‌హుసేన్ తెలియజేశారు.